పెండింగ్ పనులు పూర్తి కావాలి

- బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి
- వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, జూన్ 14 : అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పనులను రెండు రోజుల్లో పూర్తి చేయాలని, విద్యార్థులకు యూనిఫామ్‌ల పంపిణీ సక్రమంగా జరుగాలని వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. ముఖ్యంగా మిషన్ భగీరథ సర్వే పనుల కోసం బృందాలను ఏర్పాటు చేసి త్వరితగతిన ముగించాలన్నారు. ఇంకా పూర్తి కాని అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన తాగునీరు, మైనర్, మేజర్ మరమ్మతులు, టాయిలెట్స్, విద్యుద్దీకరణ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో ఇప్పటివరకు పూర్తైన పనులు ఎన్ని.. ఇంకా ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయో మండలాల వారీగా వివరాలను అడిగి తెలుసుకున్నారు. బడిబాట కార్యక్రమం ద్వారా బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఉపాధ్యాయులు, ఎంపీడీవోలు, ఎంఈవోలు, ప్రైమరీ స్కూల్ హెడ్‌మాస్టర్లు , అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, ఏపీఎంలకు సూచించారు. ఈ కాన్ఫరెన్స్‌లో డీఆర్‌డీఏ శ్రీనివాస్, డీఈవో రేణుకాదేవి, ఎంపీడీవోలు, జిల్లా అధికారులు, ప్రత్యేక అధికారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

లక్కీడ్రా తీసి విద్యార్థులను ఎంపిక చేస్తున్న రంగారెడ్డి అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

విద్యతోనే సమాజంలో గుర్తింపు

రంగారెడ్డి జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

రంగారెడ్డి, జూన్ 14 (నమస్తే తెలంగాణ): విద్యతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని రంగారెడ్డి జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ ప్రజ్ఞ హైస్కూల్, ఆమనగల్లు, ఫాతిమా హైస్కూల్, కొత్తూరు నందు 3, 5 ,8 తరగతుల్లో గిరిజన బాలురు, బాలికల ఎంపిక కోసం లక్కీడ్రా తీశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ లక్కీ డ్రాలో విజేతలుగా నిలిచిన చిన్నారులను అభినందించారు. ప్రతిమాసింగ్ మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదివి అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. మూడోతరగతిలో 45 సీట్లుండగా 39 మంది విద్యార్థులు దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు. ఐదోతరగతిలో 22 సీట్లకు 58 మంది, 8వ తరగతిలో 22 సీట్లకుగాను 40 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. 89 సీట్లకు 137 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా వారిలో 83 మందిని ఎంపిక చేశామన్నారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ అధికారిణి రామేశ్వరీ దేవి, అధికారులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మూడోబెటాలియన్‌లో క్యాంటిన్ ప్రారంభం

పోలీసులు ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగాలని అడిషనల్ డీజీపీ స్వాతిలక్రా అన్నారు. శుక్రవారం ఇబ్రహీంపట్నం సమీపంలోని ఆక్టోపస్-మూడో బెటాలియన్‌లో సీపీసీ క్యాంటిన్‌ను ఆమె బెటాలియన్ కమాండెంట్ మురళీకృష్ణ, అడిషనల్ కమాండెంట్లు సురేశ్, గంగారాంలతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు, మూడోబెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

-ఇబ్రహీంపట్నం రూరల్, జూన్ 14

సమావేశంలో మాట్లాడుతున్న రంగారెడ్డి జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ దామోదర్

ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలి

రంగారెడ్డి జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ దామోదర్

షాబాద్, జూన్ 14 : నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని సక్సెస్ చేయాలని రంగారెడ్డి జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ దామోదర్ అన్నారు. శుక్రవారం మండల పరిషత్తు కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీడీవో అపర్ణ, ఎంఈవో శంకర్‌రాథోడ్ ఆధ్వర్యంలో ఈ నెల 20న జరుగనున్న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవ కార్యక్రమంపై ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, అంగన్‌వాడీ సూపర్ వైజర్లతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దామోదర్ మాట్లాడుతూ..12 నెలల నుంచి 23 నెలల్లోపు చిన్నారులకు సగం మాత్ర రెండు స్పూన్ల మధ్య క్రష్ చేసి భోజనం సమయంలో వేయాలని, 23 నెలల నుంచి ఐదేండ్లలోపు పిల్లలకు పూర్తి మాత్ర క్రష్ చేసి నీళ్లు తాగించాలని, 6-19 ఏండ్ల లోపు వారికి ఒక పూర్తి మాత్ర నమిలి మింగించాలని సూచించారు.

అంగన్‌వాడీ కేంద్రాలు, ఇంటర్, ఐఐటీ కళాశాలల్లోని విద్యార్థులు తప్పనిసరిగ్గా మాత్రలు వేసుకోవాలన్నారు. ఈ మాత్రలు వేసుకుంటే పిల్లల్లో రక్తహీనత, బుద్ధిమాంద్యం తొలిగి ఆరోగ్యవంతులుగా ఎదుగుతారన్నారు. కార్యక్రమంలో షాబాద్, చందనవెల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల డాక్టర్లు శ్రీనివాస్, వరలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

చీడ, పీడల సమస్య ఉండదు..

రైతులు ఓ పొలంలో వరుసగా ఒకే పంటను సాగు చేయడం వల్ల భూసారం దెబ్బతింటుంది. అందువల్ల పంట ఎదుగుదలకు అధికంగా ఎరువులు వాడాల్సి వస్తుంది. చీడ, పీడల బెడద కూడా అధికంగా ఉంటుంది. తద్వారా పంట నష్టపోయే ప్రమాదమున్నది. పంటల మార్పిడితో చీడ, పీడల సమస్య ఉండదు. దిగుబడి కూడా బాగా వస్తుంది.

-రాగమ్మ, వ్యవసాయ శాఖ అధికారిణి, మొయినాబాద్

పంట మార్పిడితో

ప్రయోజనాలెన్నో..

- తగ్గనున్న చీడపీడల ఉధృతి
- సారవంతం కానున్న నేలలు
- అధిక దిగుబడికి అవకాశం

మొయినాబాద్, జూన్ 14 : పంట మార్పిడితో అధిక ప్రయోజనాలున్నాయని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. పొలంలో ఒకే పంటను వరుసగా సాగు చేస్తే భూసారం దెబ్బతినడంతోపాటు పీడల ఉధృతి పెరుగుతుందని వారు చెబుతున్నారు. పంట మార్పిడితో అధిక దిగుబడులొస్తాయంటున్నారు. వానకాలం, యాసంగిలో భిన్నమైన పంటలను సాగు చేస్తే చీడపీడల ఉధృతి కూడా చాలా తగ్గుతుందని.. ఒక పంటను ఆశించే పరుగులు మరో పంటను ఆశించవని అధికారులు పేర్కొంటున్నారు.

పంటలను మార్చుతూ ఉండాలి

సాధారణంగా నీటి వనరులు ఉన్న చోట ఎక్కువగా వరితోపాటు వాణిజ్య పంటలను సాగు చేస్తుంటారు. వరి, జొన్న, మొక్కజొన్న లాంటి పైర్లు నేల పై పొరల నుంచి .. పత్తి, కంది లాంటివి నేల లోపల పొరల నుంచి పోషకాలను తీసుకుంటాయి. దీంతో క్రమంగా నేల భౌతిక లక్షణాలు, స్వభావం దెబ్బతింటుంది. అలాగే ఈ పైర్లను ఆశించే చీడపీడలు అక్కడ స్థిర నివాసం ఏర్పాటు చేసుకుంటాయి. ఇవి అభివృద్ధి చెందుతూ పంటకు తీవ్ర నష్టం కలిగిస్తాయి. పంట మార్పిడి క్రమంలో వాణిజ్య పంటలు ఒక్కసారి పప్పు జాతి(చిక్కుడు) పైర్లు మరోసారి మార్పిడి చేస్తుండాలి. అవసరమైనప్పుడు పశుగ్రాసం కోసం గడ్డిజాతి పైర్లు భూసారాన్ని పెంచేందుకు పచ్చిరొట్టను కూడా సాగు చేసుకోవచ్చు.

ప్రయోజనాలివి..

- వరి సాగు చేసే ముందు పొలంలో పప్పుజాతి పైర్లు వేస్తే నేల సారవంతమవుతుంది.
- వేరుశనగలో ఆకు ముడత నివారణకు పప్పుజాతికి చెందిన పైరుతో మార్పిడి చేయాలి.
- కంది, మిరపలో ఎండు తెగులు నివారణకు జొన్న , మొక్కజొన్న పంటలతో మార్పిడి చేయాలి.
- కంది పంటను మొక్కజొన్న, జొన్న నువ్వులాంటి పంటలతో మార్పిడి చేస్తే కాయ తొలిచే పురుగు ఉధృతిని తగ్గించొచ్చు.
- టమాట సాగు చేసిన తర్వాత అందులో మిరపను సాగు చేయొద్దు.
- ఆహార పంటలైన వరి, జొన్న, మొక్కజొన్న, సజ్జ పైర్లను పప్పుజాతి పెసర, మినుము, వేరుశనగతో పంట మార్పిడి చేయాలి.
- పంట మార్పిడితో భూమిలో నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుంది.
- భూమిలో చీడపీడల బెడద తగ్గుతుంది. పంట దిగుబడి కూడా ఎక్కువ వస్తుంది.
- నేల భౌతిక స్వరూపం మారుతుంది. నేలలు సారవంతం అవుతాయి.
- శిలీంధ్రాలతో వచ్చే తెగుళ్లను అరికట్టొచ్చు.
- కీటకాల గుడ్లు వృద్ధి చెందకుండా చూడొచ్చు.
- వానపాముల అభివృద్ధి కూడా ఎక్కువగా ఉంటుంది

ఎరువుల షాపులో విత్తనాల రికార్డులను పరిశీలిస్తున్న గీతారెడ్డి

విత్తనాలను అధిక ధరలకు విక్రయించొద్దు

మంచాల, జూన్ 14 : విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని రంగారెడ్డి జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి గీతారెడ్డి హెచ్చరించారు. శుక్రవారం ఆమె మండలంలోని మంచాల, ఆరుట్ల, లోయపల్లి గ్రామాల్లోని విత్తనాల దుకాణాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులకు విత్తనాలు, ఎరువులను అమ్మినప్పుడు తప్పనిసరిగ్గా రసీదులను ఇవ్వాలని నిర్వాహకులకు సూచించారు. షాపుల్లో నకిలీ విత్తనాలను అమ్మొద్దన్నారు. రైతులకు సరిపడా విత్తనాలను అందుబాటులో ఉంచాలని.. ప్రతి షాపు ఎదుట ధరల పట్టికతోపాటు ఎరువుల నిల్వలకు సంబంధించిన బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏవో జ్యోతిశ్రీ, ఏఈవో లింగస్వామి పాల్గొన్నారు.

గుడిసెలను ఖాళీ చెయ్యం..

- రావినారాయణరెడ్డి కాలనీలో సీపీఐ నిరసన
- బీఆర్ఎస్ ప్రభుత్వం తమ జోలికి రాలేదు
- కాంగ్రెస్ వచ్చాకే తొలగించాలని చూస్తున్నదని మండిపాటు

రావినారాయణరెడ్డి కాలనీలో ఆందోళనకు దిగిన సీపీఐ నాయకులు, గుడిసెల వాసులు

పెద్దఅంబర్‌పేట, జూన్ 14 : మున్సిపాలిటీ పరిధి కుంట్లూరులోని రావినారాయణరెడ్డి కాలనీలో వేసుకున్న గుడిసెల జోలికి వస్తే ఊరుకునేది లేదని సీపీఐ నాయకులు హెచ్చరించారు. ఒక్క గుడిసెనూ తొలగించబోమని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా తమ జోలికి రాలేదని, కాంగ్రెస్ సర్కారు వచ్చాకే గుడిసెలను తొలగించాలని చూస్తున్నదని మండిపడ్డారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ వందల మంది నిరుపేదలు, సీపీఐ నాయకులు శుక్రవారం రావినారాయణరెడ్డి కాలనీలో ఆందోళనకు దిగారు. గురువారం రాత్రి గుడిసెలను తొలగిస్తారన్న సమాచారంతో స్థానికులు, సీపీఐ నాయకులు రాత్రంతా గస్తీ కాశారు. గుడిసెల జోలికి రావొద్దని విజ్ఞప్తి చేశారు. పాటలతో నిరసన గళం వినిపించారు. ఇది భూదాన్‌భూమి అని, కేసు హైకోర్టులో ఉన్నదని.. న్యాయస్థానం తీర్పు వచ్చేవరకు సమయం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఆందోజు రవీంద్రాచారి, ముత్యాల యాదిరెడ్డి, కౌన్సిలర్ లక్ష్మణ్, నాయకులు హరిసింగ్‌నాయక్ పాల్గొన్నారు.

గుడిసెలను ఖాళీ చేయాలి : తహసీల్దార్

రావినారాయణరెడ్డి కాలనీలో వేసిన గుడిసెలను ఖాళీ చేయాలని అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ రవీందర్‌దత్తు కోరారు. శుక్రవారం హయత్‌నగర్ సీఐ రామకృష్ణతో కలిసి ఆయన అక్కడికి వచ్చి సీపీఐ నాయకులతో మాట్లాడారు. కోర్టు ఆర్డర్ వచ్చినందున ఖాళీ చేయాలని చెప్పారు. వారం పాటు సమయం ఇస్తున్నామని పేర్కొన్నారు. అధికారులు, పోలీసులకు సహకరించాలని కోరారు.

న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి

న్యాయ విజ్ఞాన సదస్సులను

సద్వినియోగం చేసుకోవాలి

రంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి

ఆమనగల్లు, జూన్ 14 : వ్యవసాయ న్యాయ విజ్ఞాన సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ శశిధర్‌రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం ఆమనగల్లు పట్టణంలోని రైతువేదికలో న్యాయ, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో 'వ్యవసాయ న్యాయ విజ్ఞాన సదస్సు'ను నిర్వహించారు. సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జడ్జి శ్రీదేవి మాట్లాడుతూ సుప్రీం కోర్టు, హైకోర్టు ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన న్యాయ సలహాల కేంద్రాలు రైతులకు ఎంతగానో దోహద పడతాయన్నారు. రైతులు భూతగాదాలు, న్యాయపరమైన సమస్యలను న్యాయ సదస్సులో పరిష్కరించుకోవాలన్నారు. రైతులు విత్తనాలు, ఎరువులను కొన్నప్పుడు రసీదులను తీసుకోవాలన్నారు. నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై న్యాయ సలహా కేంద్రాల్లో ఫిర్యాదు చేయొచ్చన్నారు. రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అనిత, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా, జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి గీత, ఏడీఏ సుజాత, ఎంపీడీవో శ్రీకాంత్, ఎస్ఐ బలరాంనాయక్, ఎంపీవో శ్రీలత, మున్సిపల్ కమిషనర్ వసంత, డిప్యూటీ తహసీల్దార్ వినోద్‌కుమార్, అరుణకుమారి, ఏఈవోలు రాణి, శివతేజ, సాయిరాం, మీనాక్షి, బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

సీఎంఆర్‌ను సకాలంలో అందించాలి

మిల్లర్లకు వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ ఆదేశం

సమావేశంలో మాట్లాడుతున్న వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, జూన్ 14 : జిల్లాలో సీఎంఆర్(కస్టమ్ మిల్లింగ్ రైస్) సకాలంలో ప్రభుత్వానికి అందించాలని వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ మిల్లర్లను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రైస్ మిల్లర్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కస్టమ్ మిల్లింగ్ రైస్‌ను ప్రభుత్వానికి త్వరగా అందించాలని.. లేనిచో కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా సివిల్ సప్లయ్ అధికారి, డీటీసీఎస్‌లు ప్రతిరోజూ తమ పరిధిలో ఉన్న రైస్ మిల్లులను పర్యవేక్షించి మిల్లర్లు సకాలంలో సీఎంఆర్‌ను అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి మిల్లరూ గడువు తేదీలోగా తమ సీఎంఆర్‌ను పూర్తి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా సివిల్ సప్లయ్ అధికారి రాజేశ్వర్, డీఎంసీఎస్ సుగుణాబాయి, రైస్‌మిల్లర్ అసోసియేషన్ అధ్యక్షుడు బలీశ్వర్‌గుప్తా, శ్రీధర్‌రెడ్డి, డీటీసీఎస్‌లు, మిల్లర్లు పాల్గొన్నారు.

ప్రపంచ రక్తదాతల దినోత్సవం

ఆరోగ్యవంతులు ప్రతి మూడు నెలలకొకసారి రక్తదానం చేయొచ్చని వికారాబాద్ జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ పాల్వన్‌కుమార్ అన్నారు. శుక్రవారం ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఏటా జూన్ 14న ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని జరుపుకొంటామన్నారు. 18 ఏండ్ల నుంచి 55 ఏండ్లలోపు ఉన్న ఆరోగ్యవంతులు ఎవరైనా రక్తాన్ని దానం చేయొచ్చన్నారు. వికారాబాద్ జనరల్ దవాఖాన బ్లడ్ బ్యాంకు సిబ్బంది 20 మంది రక్తదాతల నుంచి రక్తాన్ని సేకరించారు. అనంతరం రక్తదాతలకు డీఎంహెచ్‌వో ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి రవీంద్రయాదవ్, డిప్యూటీ డీఎంహెచ్‌వో జీవరాజ్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రమేశ్‌కుమార్, మైనారిటీ చైర్మన్ సర్ఫరాజ్ నవాజ్, ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ యాదగిరి, రాజ్‌కుమార్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

-వికారాబాద్, జూన్ 14

భారీ వర్షం.. కూలిన చెట్టు

పెద్దేముల్‌లో 13 గంటలపాటు నిలిచిన విద్యుత్తు సరఫరా

పెద్దేముల్, జూన్ 14 : మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఈ వానకు పాత పోలీస్‌స్టేషన్ వెనుకభాగంలో ఉన్న ఓ భారీ చెట్టు ఒక్కసారిగా కూలి పెద్దేముల్-11 కేవీ లోకల్ విద్యుత్తు లైన్‌పై పడడంతో ఆ స్తంభానికి ఉన్న తీగలు ఒక దానికొకటి తాకుతూ పెద్ద ప్రమాదం చోటుచేసుకున్నది. దీంతో మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో రాత్రి 8.30 నుంచి శుక్రవారం ఉదయం 9.30 వరకు విద్యుత్తు సరఫరాలో తీవ్ర అంతరాయం కలిగింది. దీంతో ప్రజలు చీకట్లో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మండల విద్యుత్తు ఏఈ రఘువీర్, సిబ్బందితో కలిసి 11 కేవీ విద్యుత్తు లైన్‌కు మరమ్మతులు చేసి సరఫరాను పునరుద్ధరించారు.

పాత పోలీస్‌స్టేషన్ వెనుకభాగంలో ఉన్న విద్యుత్తులైన్ పై నుంచి కింద పడిపోయిన చెట్టు

వాగులో గల్లంతైన యువకుడి మృతి

- ఉధృతంగా పారుతున్న నీటిలో బైక్‌తో సహా కొట్టుకుపోయిన మైతాబ్ అలీ
- పోలీసులు, గ్రామస్తుల గాలింపుతో మృతదేహం లభ్యం

వికారాబాద్, జూన్ 14 : ఉధృతంగా పారుతున్న వాగును దాటుతూ ఓ యువకుడు బైక్‌తో సహా కొట్టుకుపోయి మృతి చెందాడు. ఈ ఘటన మోమిన్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. మోమిన్‌పేట సీఐ ఆంజనేయులు, ఎస్ఐ అరవింద్ కథనం ప్రకారం.. గురువారం రాత్రి మోమిన్‌పేటలో భారీ వర్షం కురిసింది. ఈ వానకు మేకవనంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో గల బండ్లవాగు వరద ఉధృతంగా రోడ్డుపై ప్రవహించింది. కాగా మండలంలోని అమ్రాదికలాన్ గ్రామానికి చెందిన మైతాబ్‌అలీ(28) వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. గురువారం రాత్రి మేకవనంపల్లి నుంచి బైక్‌పై అమ్రాదికలాన్ గ్రామానికి వెళ్తుండగా.. వరద ఉధృతికి బైక్‌తో సహా వాగులో కొట్టుకుపోయాడు. విషయం తెలుసుకున్న పోలీసులు, గ్రామస్తులు ఘటనాస్థలికి చేరుకుని అతడి కోసం గాలించారు. శుక్రవారం ఉదయం గాలింపు చర్యల్లో భాగంగా ప్రమాదస్థలం నుంచి కిలోమీటర్ దూరంలో అతడి మృతదేహం లభ్యమైనది. దానిని పోస్టుమార్టం నిమిత్తం మర్పల్లి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడికి భార్య రమీజా, కుమార్లై రఫన్ ఉన్నారు. మృతుడి సోదరుడు అక్తార్ పాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అరవింద్ తెలిపారు.

మృతుడు మైతాబ్‌అలీ(ఫైల్)

యువకుడిని గాలిస్తున్న పోలీసులు